క్లుప్తంగా

కుమారస్వామికి షష్టి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో గురువారం షష్టిని పురస్కరించుకుని అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. అభిషేకం, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

చౌడేశ్వరీ దేవి విగ్రహం ధ్వంసం



దెబ్బతిన్న పెదాలు, చెయ్యి

పాములపాడు: స్థానిక మిట్టకందాల రహదారిలో ఉన్న పొలిమేర చౌడేశ్వరీ దేవి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. గురువారం పూజలు చేసేందుకు వెళ్లిన రైతులు గమనించారు. అమ్మవారి విగ్రహం పెదాలు, చేతిపై రాళ్లతో కొట్టిన ఆనవాళ్లు ఉన్నాయి. దెబ్బతిన్న విగ్రహానికి పూజలు చేయరాదని, మరలా నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గంగాధర్ రెడ్డి బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం కృష్ణమోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపల్ పాఠశాలలో సెప్టెంబర్ 23న జరిగిన జిల్లా స్థాయి అండర్– 17 బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఈనెల 9,10 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థిని అభినందించారు.

దత్తాత్రేయుడికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి గురువారం సందర్భంగా విశేష పూజలను అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన మహబూబ్‌బాషా

ఆత్మకూరు: స్థానిక గరీబ్ నగర్‌లోని పాత చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. మహబూబ్‌బాషా(40) అనే వ్యక్తి తన ఇంట్లోనే ఫ్యాన్‌కు గురి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి పోటీలకు 'డిపాల్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

ఆత్మకూరు/రూరల్: స్కూల్ గేమ్స్ పెడరేషన్ అండర్ – 14 బాక్సింగ్ పోటీలకు స్థానిక డిపాల్ స్కూల్ విద్యార్థులు యుగంధర్, మోహన్, కృష్ణసాయి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ షిన్స్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ వినీత్ తెలిపారు. గురువారం వారు కోర్ ఉపేంద్రతో కలిసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనపరిచి ఈ నెల 21 నుంచి 24 వరకు మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

డెయిరీ కేంద్రంలో తనిఖీలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని శ్రీనివాస డెయిరీలో గురువారం విజిలెన్స్, ఫుడ్ సెఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. డెయిరీలో విజిలెన్స్ సీఐ రామక్రిష్ణ, ఫుడ్ సెఫ్టీ అధికారి వెంకటరాముడు తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, పాలు, పెరుగు, నెయ్యి తదితర పదార్థాలను పరిశీలించారు. పెరుగు, నెయ్యి నమూనాలు ల్యాబ్ పంపుతామని అధికారులు తెలిపారు.

బీమా భారం రైతుదే

- ప్రీమియం చెల్లిస్తేనే రబీ పంటలకు పరిహారం
- నియోజకవర్గంలోని 52,373 రైతులపై రూ.80.37 లక్షల భారం
- ఉచితంగా పంటల బీమా కల్పించిన జగనన్న
- అన్నదాతలే చెల్లించాలంటున్న కూటమి ప్రభుత్వం

పంటల సాగులో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. భూసార పరీక్షల నుంచి విత్తనాలు, ఎరువులు, మందులు నాణ్యమైనవి అందజేసి, సాగులో సలహాలు సూచనలు అందేలా చేసింది. చివరకు దిగుబడులను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసింది. ఇక విపత్కర పరిస్థితుల్లో పంట నష్టపోతే బీమా అందజేసి ఆదుకుంది. బీమా అందజేసేందుకు రైతుల నుంచి ప్రీమియం వసూలు చేయకుండా సర్కారే భరించింది. అయితే ఇదంతా గత ఐదేళ్లుగా సాగింది. ప్రస్తుతం రైతులను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. పెట్టుబడి సాయం అందజేయకపోగా..చివరకు బీమా ప్రీమియం కూడా పంటల వారీగా రైతులే చెల్లించాలని ప్రకటించింది. ఇప్పటికే వ్యవసాయం గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్నామని.. ఈ సమయంలో బీమా భారం మోపడం దారుణమని రైతులు వాపోతున్నారు.



మండ్లెం వద్ద సాగులో ఉన్న ఉల్లి పంట



మండ్లెంలో రబీలో సాగు చేసిన మినుము పంటకు మందు వేస్తున్న రైతు



తూడిచెర్ల వద్ద నాటుకు వరినారును సిద్ధం చేస్తున్న వ్యవసాయ కూలీలు

జూపాడుబంగ్లా: 2024 ఎన్నికల వరకు జగనన్న రైతులకు అండగా ఉంటూ ఖరీఫ్, రబీ పంటల సాగుకు సమయంలో రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సహాయంగా ఏటా రూ.13,500 నగదును రైతుల ఖాతాలో జమ చేశారు. అలాగే.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటనష్టం వాటిల్లితే నష్టపోయిన ప్రతి రైతుకు ఏ సీజన్‌కు చెందినది ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ అందజేశారు. అయితే 2024 ఎన్నికల సమయంలో.. తాను మారానని.. అన్ని వర్గాలకు అండగా నిలుస్తానని, ముఖ్యంగా వ్యవసాయానికి ప్రాధాన్యతినస్తానని చంద్రబాబు పదేపదే చెప్పారు. ఇందులో భాగంగా రైతన్నలకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20వేలు ఇస్తానని హామీనిచ్చారు. దీంతో రైతులు నమ్మి ఓట్లేసి గెలిపించారు. తీరా గెలిచాక..సీసా పాతదైనా..వాసన పోలేదన్న చందంగా తన తీరు మారలేదని తన అసలు స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ప్రస్తుతం పంటల బీమా వర్తించాలంటే రైతులే ప్రీమియం చెల్లించాలని చెప్పడంతో అవాక్కవడం అన్నదాతల వంతైంది.

80,375 ఎకరాల్లో పంటల సాగు..

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల, మిడ్తూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో 47,518 మంది రైతులు, 4,855 మంది కౌలు రైతులు రబీ సీజన్‌లో 80,375 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశముందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, ఉల్లి, కంది, మినుము, పెసర, వేరుశనగ, జొన్న, పొగాకు తదితర పంటలు సాగు చేస్తారు. ఈ పంటలకు గత ఐదేళ్లు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మాత్రం ప్రీమియం రైతులే చెల్లించాలని ప్రకటించింది. కనీసం ఎకరాకు రూ.వంద ప్రకారం లెక్కించినా.. దాదాపు రూ.80,37,500 భారం రైతులపై పడుతుంది. రబీ సీజన్‌లో రైతులు సాగుచేసే మొక్కజొన్న, కంది పంటలకు బీమా వర్తింపజేయకపోవటంతో ఆయా పంటలు సాగుచేసే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు పంటలకేనా బీమా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగు చేసిన ఏ పంటైనా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకుంటే చాలు. పంటల బీమా వర్తించేది. కూటమి ప్రభుత్వం రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలని పేర్కొనటంతో పాటు కేవలం శనగ రూ.84, వరి రూ.126, జొన్న రూ.59, మినుము రూ.48, వేరుశనగ రూ.64, ఉల్లి రూ.90ల చొప్పున డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించి పంటలకు బీమా చేయించుకోవాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.అయితే నియోజకవర్గంలో రబీలో రైతులు అధికంగా మొక్కజొన్న,కంది పంటలను సాగు చేస్తారు. ఈ పంటలకు బీమా వర్తింపజేయకపోవటంతో మొక్కజొన్న, కంది పంటలు సాగుచేసే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుచేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకున్నా, చేసుకోకపోయినా ఎలాంటి ప్రయోజనం లేనప్పుడు చేతి నుంచి డబ్బులు చెల్లించి పంటల బీమా చేయించుకోవటం వల్ల ప్రయోజనం ఏముంటుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

నియోజకవర్గంలోని రైతులు, సాగు చేస్తున్న భూముల వివరాలు ఇలా...

మండలం	రైతుల సంఖ్య	కౌలు రైతుల సంఖ్య	రబీ సాగు హెక్టార్లలో
జూపాడుబంగ్లా	9,336	925	4,565
నందికొట్కూరు	6,741	1,022	5,807
మిడ్తూరు	12,520	920	6,995
పగిడ్యాల	2,900	630	2,383
పాములపాడు	7,936	923	3,250
కొత్తపల్లి	8,085	435	9,150
మొత్తం	47,518	4,855	32,150

ఉచితంగా పంటల బీమా వర్తింపజేయాలి



రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్న సమయంలో కూటమి ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని పేర్కొనటం తగదు. గత ప్రభుత్వం రైతులకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించిన తీరుగానే ఈ ప్రభుత్వం కూడా కల్పించాలి. రైతులే పంటల బీమా చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు. – **సంజీవయ్య, రైతు, తంగడంచ**

రైతులపై భారం మోపడం తగదు



వాతావరణ పరిస్థితులు అనుకూలించక సాగుచేసిన పంటల దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్న తరుణంలో రైతులే ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాలని కూటమి ప్రభుత్వం ఆదేశించడం సరికాదు. రైతులను ఆదుకొంటామని పేర్కొన్న చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాకా రైతులపై భారం మోపటం భావ్యం కాదు. ప్రభుత్వమే పంటల ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– **నాగిరెడ్డి, రైతు, జూపాడుబంగ్లా**

డిసెంబర్ 15లోగా ప్రీమియం చెల్లించాలి



రబీ సీజన్‌లో శనగ, జొన్న, మినుము, వేరుశన, ఉల్లి పంటలు సాగుచేసుకొనే రైతులు డిసెంబర్ 15వ తేదీ లోగా రైతు సేవా, మీసేవ కేంద్రాల్లో పంటల బీమా నిర్ణీత ప్రీమియం చెల్లించాలి. వరి పంట సాగుచేసిన రైతులు డిసెంబర్ 31లోగా ప్రీమియం చెల్లించాలి. బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకొనే రైతులు ప్రత్యేకంగా ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాల్సిన అవసరం లేదు. ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకున్న వారికి మాత్రమే పంటనష్టం వాటిల్లినప్పుడు నష్ట పరిహారం మంజూరు అవుతుంది.

– **విజయశేఖర్, ఏడీఏ, నందికొట్కూరు**

జోరుగా రేషన్ బియ్యం వ్యాపారం



ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. నందికొట్కూరు పట్టణానికి చెందిన ఓ బియ్యం వ్యాపారి మండ్లెం, తంగడంచ, జూపాడుబంగ్లా, తాటిపాడు, తరిగోపుల, పి.లింగాపురం తదితర గ్రామాల్లో 50 కిలోల రేషన్ బియ్యం బస్తా రూ.600 నుంచి రూ.800 చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని రాత్రి పూట నంబర్‌లేని ఆటోలు, మినీ డీసీఎం వాహనాల్లో గ్రామాలు దాటించి తంగడంచ, మండ్లెం గ్రామాల్లోని ఇళ్లల్లో నిల్వ చేస్తున్నట్లు తెలిసింది. భారీ మొత్తంలో బియ్యాన్ని నిల్వచేసి రాత్రి వేళల్లో లారీల్లో జిల్లా సరిహద్దులు దాటించి తెలంగాణ, తమిళనాడు ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారనే ఆరోపణలున్నాయి. సదరు వ్యాపారి ఓసారి మండ్లెం గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి పోలీసులకు పట్టుబడినా ఆయనలో మార్పురాలేదు. గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి యథేచ్ఛగా తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవటంతో అక్రమాలు కొనసాగుతున్నాయి.

అత్యాచారాలను అరికట్టడంలో అలసత్వం ఎందుకు?



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నందికొట్కూరు: అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నారులపై, మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే కూటమి ప్రభుత్వం నిద్రపోతుందా అని ప్రశ్నించారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో మహిళలకు, చిన్న పిల్లలకు రక్షణ కరువైందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రతి రోజు 86 అత్యాచారాలు జరుగుతునట్లు సమాచారం ఉందన్నారు. అంతే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నా చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందక రక్తహీనతతో మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఈ నెల 14న పట్టణంలో నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, నాగన్న, బాబు, మధు పాల్గొన్నారు.

నదీ జలాల వినియోగంలో ప్రభుత్వం విఫలం

నంద్యాల(రూరల్): కృష్ణా, తుంగభద్ర నదీ జలాల వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. స్థానికంగా నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రాజెక్టుల నిర్మాణ, నిర్వహణలో సమతుల్యం లేకపోవడంతో రాయలసీమ కరువు సీమగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాయలసీమ జలసంరక్షణ అవశ్యకతను వివరిస్తూ పుస్తకరూపంలో ముఖ్యమంత్రికి రాసిన విజ్ఞాపన పత్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాకు అందజేశారు. అనంతరం దశరథరామిరెడ్డి మాట్లాడుతూ వంద రోజులుగా నిరంతరాయంగా కృష్ణా, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా జలాలను సద్వినియోగం చేసుకోలేదన్నారు.. కోస్తా ప్రాంతంలో 30 శాతం భూమికి సాగునీరు లభిస్తుందని, అదే రాయలసీమలో 9 శాతం భూమికి మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. సీమలో అనేక సాగునీటి ప్రాజెక్టులు కేవలం శిలాఫలకాలకు మాత్రమే పరిమితమయ్యాయని, ఆయా ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రికి పుస్తకం రూపంలో తెలియజేస్తున్నానన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమితి ఉపాధ్యక్షుడు వైఎస్.రెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి, నాయకులు సుధాకర్‌రావు, సాకేస్వరరెడ్డి ఉన్నారు.

12న సమావేశం

ఆత్మకూరు: స్థానిక పురపాలక సంఘంలో అనుమతి లేని లేఅవుట్ యజమానులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లతో ఈనెల 12న పురపాలక సంఘం కార్యాలయంలో సమావేశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు గురువారం తెలిపారు.

రెడ్ క్రాస్ చేయూత



నిత్యావసర సరుకులు అందిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

మహానంది: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన గాజులపల్లె గ్రామానికి చెందిన సుబ్బుడు, లింగమయ్యలకు గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ బియ్యం, టార్పాలిన్లు, దుప్పట్లు అందించింది. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, సొసైటీ మండల చైర్మన్ కె.అమర్‌నాథ్, వైస్ చైర్మన్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆంజనేయపురం గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.

అన్నప్రసాద కేంద్రం తనిఖీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్రశేఖరరెడ్డి గురువారం అన్నప్రసాద వితరణ విభాగాన్ని తనిఖీ చేశారు. వంటకాలను పరిశీలించారు. అనంతరం అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న పలువురు భక్తులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అన్నప్రసాద వితరణలో వంటకాలన్నీ రుచికరంగా ఉండాలని, వంటకాలలో కూరగాయలను విరివిరిగా వినియోగించాలని సిబ్బందికి సూచించారు. వండిన ప్రతి వంటకం భక్తుడికి అందేవిధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. భక్తులు అధిక సమయం వేచి ఉండకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.



పాలెంచెరువు గూడెం సమీపంలో వరి పొలం చుట్టూ చీరలను కంచెగా ఏర్పాటు చేసుకున్న రైతన్న

పైరుకు రక్షణగా చీర

కొత్తపల్లి: సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు రైతులు వివిధ రకాల పద్ధతులు అవలంభిస్తుంటారు. కొందరు కంచె ఏర్పాటు చేసుకుంటే మరికొందరు తక్కువ ఖర్చులో ముగిసేలా చర్యలు చేపడుతుంటారు. ఇందులో భాగంగా..పాలెం చెరువు గూడెం సమీపంలో వరి పంటను అడవి పందులు, జంతువుల నుంచి రక్షించుకునేందుకు ఓ సన్నకారు రైతు చీరలను కంచెగా ఏర్పాటు చేశాడు. పైరు చుట్టూ కర్రలు పాతి వాటికి పాత చీరలను వలయంలా కట్టాడు.

జీవన ప్రమాణాల అభివృద్ధికి శిక్షణ అవసరం



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా

ఆత్మకూరు: జీవన ప్రమాణాల అభివృద్ధికి శిక్షణ అవసరమని ఆత్మకూరు అటవీ రేంజర్ దొరస్వామి, డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా అభిప్రాయపడ్డారు. గురువారం నాగలూటి, బైర్లూటీ గ్రామాల్లో లిటిల్ ఫ్లవర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏపీ ఫారెస్టు ఎన్ఎస్‌టీఆర్ సహకారంతో శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడ్డ సంచులు, బ్యాగుల తయారీపై అక్కడి ప్రజలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ శిక్షణ పొంది ఉపాధి పొందాలని సూచించారు.

కేన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: కేన్సర్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని బాపునంతాపురం గ్రామంలో 104 వైద్యసేవల కార్యక్రమం సందర్భంగా జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పవన్‌కుమార్ ప్రజలకు కేన్సర్ వ్యాధి కారకాలు, లక్షణాలు, చికిత్స గురించి వివరించారు. బీడీలు, సిగరెట్లు, గుట్కాలు, ఖైనీలు వంటి పొగాకు సంబంధ పదార్థాలు వాడడం వల్ల పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ వస్తుందన్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. బరువు తగ్గిపోవడం, జ్వరం రావడం, దీర్ఘకాలికంగా మానని నోటి పుండ్లు వంటి ప్రాథమిక లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎన్‌సీడీసీడీ కార్యక్రమంలో 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ అన్ని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లలో ఈనెల 14 నుంచి కేన్సర్ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో బైర్లూటీ సీహెచ్ఓ ఫాతిమా, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, విశ్వనాథ్, భీమేశ్వరి పాల్గొన్నారు.

- **మహానంది:** 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వేణుకార్తీకేయ తెలిపారు. అందరికీ కేన్సర్ పరీక్షలు, కేన్సర్‌పై విజయం...స్క్రీనింగ్‌తో సాధ్యం కార్యక్రమంలో భాగంగా గురువారం తిమ్మాపురంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వేణు మాట్లాడుతూ చిన్నచిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యసేవలు పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సిగ్గు..సిగ్గు!

- తలుపుల్లేని మూత్రశాలలు
- తెర చాటునే కాలకృత్యాలు



ఓ విద్యార్థి మూత్ర విసర్జనకు వెళ్లగా కాపలాగా ఉన్న విద్యార్థినులు

పరదా వద్ద కాపలాగా ఉన్న ఈ విద్యార్థినులను చూసి సిగ్గుతో తలదించుకునే దృశ్యం ఇది. తల దించుకోవాల్సింది చిన్నారులు కాదు.. ఆ పరిస్థితి కల్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు వారిని ఎన్నుకున్న ప్రజలు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే విద్యాలయాల్లో కనీస వసతులు కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని చెప్పడానికి పాములపాడు మండలం రుద్రవరం గ్రామంలోని ఈ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పరిస్థితే నిదర్శనం. 1 నుంచి 5వ తరగతి వరకు 65 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయినులు విద్యా బోధన చేస్తున్నారు. నేషనల్‌హైవే నిర్మాణ పనుల్లో భాగంగా పాఠశాలకు సంబంధించిన మూడు గదులను కూల్చేయగా ఒక గది మాత్రమే మిగిలింది. దానికి కూడా తలుపులు లేకపోవడం.. రోడ్డు పక్కనే పాఠశాల ఉండటం చేత అటుఇటు రాకపోకలు సాగించే వాహనాల వల్ల దుమ్ము తరగతి గదిలోకి వస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉపాధ్యాయినులు, విద్యార్థులు కలిసి ఒక క్లాత్‌ను అడ్డుగా కట్టి విద్యాబోధన సాగించుకుంటున్నారు. అంతకంటే అవమానకరమైన విషయమేమిటంటే మూత్రశాలలకు తలుపులు లేకపోవడం. ఉన్న 5 మూత్ర శాలల్లో ఒకదానికి మాత్రమే తలుపు ఉండటంతో దాన్ని ఉపాధ్యాయినులు వినియోగించుకుంటున్నారు. తలుపుల్లేని మిగతా నాలుగింటిలో ఒకదానికి క్లాత్ అడ్డంగా కట్టుకుని ఒక విద్యార్థి లోపలకు వెళ్తే కాపలాగా మరొకరు ఉంటున్నారు. ఇదే విషయమై ఎంఈఓ బాలాజీ నాయక్‌ను వివరణ కోరగా కొత్త బిల్డింగ్ నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్నామని అంత వరకు మూత్రశాలలకు తలుపులు ఏర్పాటు చేయిస్తామని చెప్పుకొచ్చారు.



పాఠశాల భవనానికి తెర ఏర్పాటు చేసిన దృశ్యం

– పాములపాడు

నిలిచిన 108 అంబులెన్స్ సేవలు



డీజిల్ లేక నిలిచిపోయిన 108 అంబులెన్స్

కోవెలకుంట్ల: మండలంలో గురువారం నుంచి 108 అంబులెన్స్ సేవలు నిలిచిపోయాయి. 24 గంటలు అందుబాటులో ఉండి ఆపదలో ఉన్న వ్యక్తులను సకాలంలో ఆసుపత్రులలో చేర్పించే అంబులెన్స్ డీజిల్ లేక నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం 108 సిబ్బంది వేతనాలు ఇవ్వడం అటుంచితే కనీసం డీజిల్‌కు కూడా డబ్బులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. వివిధ గ్రామాల నుంచి వైద్యం కోసం ప్రజలు 108కు కాల్ చేయగా సిబ్బంది నుంచి వాహనం బ్రేక్‌డౌన్ అనే సమాధానం రావడంతో ప్రైవేట్ వాహనాల ద్వారా రోగులను ఆసుపత్రుల్లో చేర్పించాల్సి వచ్చింది. సిబ్బందికి నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని 108 సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.